అగ్రిల్యాబ్‌ను ప్రారంభించేదెప్పుడో..?



శతశాతం పనులు పూర్తయిన జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ భవనం

- ప్రారంభానికి నోచుకోని జిల్లాస్థాయి అగ్రిల్యాబ్
- గత ప్రభుత్వ హయాంలో రూ.3.68 కోట్లతో భవన నిర్మాణం
- పరికరాలు సమకూర్చని కూటమి ప్రభుత్వం

బొండపల్లి: జిల్లాలోని రైతుల ఉన్నతి, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రతి నియోజక వర్గ కేంద్రంలో ఒక ల్యాబ్‌తో పాటు జిల్లా స్థాయిలో ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి అగ్రిల్యాబ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.68 కోట్లు మంజూరు చేసింది. బొండపల్లి మండలంలోని నెలివాడ వద్ద ల్యాబ్ నిర్మాణానికి 2020 జూన్ 8వ తేదీన అప్పటి పురపాలకశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ శంకు స్థాపన చేశారు. అప్పటికి కరోనా విలయతాండవం చేయడంతో భవన నిర్మాణాలకు కొంతకాలం ఆటంకం ఏర్పడింది. కొన్నిరోజుల తర్వాత పనులు పునః ప్రారంభించి పూర్తి చేశారు. భవనాన్ని ప్రారంభించాలని సిద్ధమయ్యే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆ కార్యక్రమం నిలిచిపోయింది.

రైతులకు అందని సేవలు

విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు పరీక్షల నిర్వహణతో పాటు భూసార పరీక్షలు, తదితర సేవలు అగ్రిల్యాబ్ ద్వారా అందించాల్సి ఉంది. ప్రభు త్వం సరఫరా చేసే విత్తనాలు, ఎరువులనే కాకుండా మార్కెట్‌లో కొనుగోలు చేసే విత్త నాలు, ఎరువులకు కూడా ఈ ల్యాబ్‌లో రైతులు పరీక్షలు చేయించు కుని వాటి నాణ్యతాప్రమా ణాలను తెలుసుకోవచ్చు. నూతన వంగడాల సాగు, యాజమాన్యపద్ధతులు, ఎదురయ్యే ఇబ్బం దులు వంటి అంశాలపై సందేహాలను ల్యాబ్‌లో ఉన్న శాస్త్రవేత్తలను సంప్రదించి నివృత్తి చేసుకుని, వారి సలహాలను పొందవచ్చు. గత ప్రభుత్వంలోనే పలు జిల్లాల్లో ఈల్యాబ్‌ల సేవలు అందుబాటు లోకి వచ్చాయి. ఇక్కడి ల్యాబ్ ప్రారంభం కాకపోవడం తో జిల్లా రైతులు తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి జిల్లాల ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ల్యాబ్ ప్రారంభం కాకపోవడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు త్వరగా ల్యాబ్‌ను ప్రారంభించి, సేవలను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

త్వరగా ప్రారంభించాలి



అగ్రిల్యాబ్‌ను అధికారులు త్వరగా ప్రారంభించాలి. గత ప్రభుత్వ హయాంలోనే భవన నిర్మాణం పూర్తయ్యింది. ఎన్నికల కోడ్ వల్ల అప్పటి పాలకులు ప్రారంభించ లేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ల్యాబ్‌ను ప్రారంభించాలనే ఆలోచన చేసినట్లు ఎక్కడా వినలేదు. ల్యాబ్‌ను ప్రారంభిస్తే రైతులకు మేలు చేకూరుతుంది.

– నెట్టి ముకుంద, బిల్లలవలస గ్రామ రైతు, బొండపల్లి మండలం

పరికరాలు రావాల్సి ఉంది



జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్ భవన నిర్మాణం శతశాతం పూర్తయ్యింది. ప్రభుత్వం పరికరాలు సమకూర్చిన వెంటనే ల్యాబ్‌ను ప్రారంభిస్తాం. సుమారు రూ.2 కోట్ల విలువైన పరికరాలు రావాల్సి ఉంది. అవి వస్తేనే రైతులకు సేవలు అందుతాయి.

– కె.మహరాజన్, గజపతినగరం ఏడీఏ

క్లుప్తంగా

కళింగ కోమటి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న వైశ్యులు

చీపురుపల్లి: కళింగ కోమటి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి తంగుడు రామకృష్ణ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి శ్రీకాకుళంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రాష్ట్ర కళింగ కోమటి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాల వారీగా నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా సంఘం జిల్లా ఉపాధ్య క్షుడిగా తంగుడు రామకృష్ణను ఎన్నుకున్నారు. పట్టణానికి చెందిన కళింగ కోమటి సంఘం ప్రతి నిధులు, వైశ్య ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వెలుగు ఏసీగా ఆదయ్య



ఏసీ ఆదయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెలుగు సిబ్బంది

గజపతినగరం: గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, రామభద్రపురం,బాడంగి మండలాల వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్‌గా ఎస్.ఆదయ్య స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎస్.కోట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఏపీఎంలు, సీసీలు ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

క్రీడలతో ఆరోగ్యం



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట: క్రీడలతో ఆరోగ్యం లభిస్తుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక సీఐ వి.నారాయణమూర్తి సూచించారు. స్థానిక వివేకానంద విద్యాసంస్థల సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కార్నివాల్‌కు అతిథిగా హాజరైన సీఐ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. వివేకానంద విద్యా సంస్థల అధినేత సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కొత్తవలస విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు, కోచ్ నూకరాజు

కొత్తవలస: విశాఖపట్నం జిల్లా వేపగుంట వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయుల సంక్షేమ సంఘం భవనంలో ఈనెల 27వ తేదీన నిర్వహించిన గంట కనకారావు మెమోరియల్ ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో కొత్తవలస ఒకినోవా కరాటే అసోసియేషన్ విద్యార్థులు సత్తా చాటారని కోచ్ నూకరాజు సోమవారం తెలిపారు. పోటీల్లో 16 మంది విద్యార్థులు పాల్గొనగా, కాటా,కుమిటీ విభాగాల్లో పలువురు విద్యార్థులు గోల్డ్, బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ సాధించారని చెప్పారు.

ఒకే ఒక్కరు!



చిత్రంలో కనిపిస్తున్నది గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీకాం ద్వితీయ సంవత్సరం తరగతి గది. సోమవారం ఇలా ఒకేఒక్క విద్యార్థిని తరగతికి హాజరయ్యారు. మండల పరిషత్ పాత కార్యాలయంలో నిర్వహిస్తున్న డిగ్రీ తరగతులకు విద్యార్థులు డుమ్మా కొడుతున్నారు. అధ్యాపకులు పూర్తి స్థాయిలో ఉన్నా విద్యార్థులు తరగతులకు హాజరుకావడం లేదని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. ఇది బాధాకరమైన విషయమని, తల్లిదండ్రులు స్పందించి విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూడాలని కోరారు. – గజపతినగరం

తాగునీటి పథకాల పరిశీలన

జామి: మండలంలో భీమసింగి,అలమండ, జామి గ్రామాల్లోని రక్షిత మంచి నీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు వై.గోవిందరావు,పైడిరాజు సోమవారం పరిశీలించారు.తరచూ ట్యాంకులను శుభ్రం చేయిస్తుండాలని, క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పార్వతి, తదితరులు ఉన్నారు.

తీర్మానించిన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలి



ఎంపీడీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందచేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్‌లు

వేపాడ: గ్రామసభల్లో తీర్మానించిన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలని, వాటిని కూడా సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్యవంతుడు ఆధ్వర్యంలో ఎంపీడీఓ సూర్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలు వురు సర్పంచ్‌లు, ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, ఉపాధి హామీ చట్టం మేరకు ఆ పను లు చేయాలన్నారు. ఉపాధిహామీ పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని చట్టం లో ఉందన్నారు. సర్పంచ్‌ల హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. సర్పంచ్‌లతో కాకుండా వెండర్ పేరిట టీడీపీ నాయకులతో పనులు చేయించడం చట్టవిరుద్ధమన్నారు. అంతకు ముందు మండల పరిషత్‌కార్యా లయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశమయ్యారు.జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, నీలకంఠ రాజపురం ఎంపీటీసీ వేచలపు వెంకట చినరాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఎలా విక్రయిస్తారు..?

చీపురుపల్లి: అనుమతులు లేకుండా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా చీపురుపల్లిలోని విజయనగరం– పాలకొండ ప్రధాన రహదారికి ఆను కుని ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలపై ఆర్డీఓ జి.వి.సత్యవాణి ఉక్కుపాదం మోపారు. ఆర్డీఓ కార్యాలయానికి సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాలపై సోమవారం ఆమె దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు ఎలా చేస్తారని దుకాణాల నిర్వాహకులను ఆర్డీఓ ప్రశ్నించారు. వెంటనే దుకాణాలను మూసి వేయించారు. దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు ఇస్తామని చెప్పారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరన్నారు. ఇంత వరకు తమ కార్యాలయం నుంచి ఒక్క దుకాణానికి కూడా అనుమతి ఇవ్వలేదని చెప్పారు.

చూసీచూడనట్లు మండల యంత్రాంగం

అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసి బాణసంచా అమ్మకాలు చేస్తుంటే మండల రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపకశాఖ అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.డివిజన్ స్థాయిలో ఉండే ఆర్డీఓ రంగంలోకి దిగితే తప్ప అనుమతులు లేని దుకాణాలను నిలువరించలేని పరిస్థితిపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చీపురుపల్లిరూరల్(గరివిడి): రోప్ స్కిప్పింగ్, మాల్కం పోటీలకు ఎంపికైన కాపుశంబాం హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం రాము, పీడీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంబాం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్, మాల్కం పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం డి.రాము సోమవారం తెలిపారు. ఇటీవల విజయనగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి మాల్కం పోటీల్లో బాలికలు, బాలుర విభాగాల్లో పొన్నాడ నిర్మల,కొండపల్లి వసుందర, లావేటి రాఘువ, పిన్నింటి చైత్రవర్షిని, వండాన తేజస్విని,రోప్ స్కిప్పింగ్ పోటీల్లో చింతా భావన,లెంక వంశీ, పైల చంద్రమౌళి, పైల వాసిని, గుడివాడ హేమంత్, వండాన లక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ ఎం.ఉదయ్‌కుమార్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పిన్నింటి రామకృష్ణ అభినందించారు.

అండర్–14 క్రికెట్ పోటీలకు భైరిపురం విద్యార్థి



మెరకముడిదాం: క్రికెట్ పోటీలకు ఎంపికైన భైరిపురం హైస్కూల్ విద్యార్థి దినేష్

మెరకముడిదాం: మండలంలోని భైరీపురం బాదం పెంటయ్య ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.దినేష్ అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం ఈశ్వరరావు సోమవారం తెలిపారు. నవంబరు 5 నుంచి 7వతేదీ వరకు కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున విద్యార్థి దినేష్ పాల్గొంటాడని హెచ్‌ఎం చెప్పారు. విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు పీడీ నానాజీరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు అర్హత



విద్యార్థినిలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు నిఖితా కుమారి సింగ్, డి.లావణ్య జాతీయ స్థాయి యూనివర్శిటీ సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని సోమవారం ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ అభినందించారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఆంధ్రాయూనివర్సిటీలో యూనివర్సిటీ స్థాయి ఇంటర్ కాలేజ్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జట్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖితా కుమారి సింగ్, లావణ్య జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. నవంబర్‌లో నిర్వహించనున్న సౌత్ జోన్ జాతీయస్థాయి యూనివర్సిటీ స్థాయి కబడ్డీ పోటీల్లో ఆంధ్రాయూనివర్సిటీ జట్టు తరఫున వీరు ఆడనున్నారు. కళాశాల అసిస్టెంట్ పీడీ పి.రామలక్ష్మి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంఘ కార్యవర్గం ఎన్నిక



జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తవలస: మండలంలో స్టార్ జర్నలిస్టు సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు మండల కేంద్రంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రెట్టపల్లి అప్పన్న, ఉపాధ్యక్షుడిగా బోని రాంబాబు, కార్యదర్శిగా టి.దేముడు, జాయింట్ సెక్రటరీగా ఎం.రమణ, ట్రెజరర్‌గా వి.రమేష్, మెంబర్స్‌గా వి.రమేష్, పి.కృష్ణప్రసాద్, బి.జగదీష్ ఎన్నికయ్యారు.

కదిలిన యంత్రాంగం



ట్యాంకు నీటిని పట్టుకుంటున్న కోటగండ్రేడు వాసులు

సాక్షి ఎఫెక్ట్...

గుర్ల మండలంలోని కోటగండ్రేడులో కుళాయిలు ద్వారా బురదనీరు సరఫరా కావడంపై 'బురదనీరే.. తాగునీరు' అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన వార్తకు అధికార యంత్రాంగం స్పందించింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌరీశంకర్, ఏఈ కిశోర్ గ్రామంలో పర్యటించారు. ట్యాంకులతో తాగునీరు సరఫరా చేశారు. దీనిపై సర్పంచ్ ముద్దాడ ప్రసన్నకుమారితో పాటు గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు. – గుర్ల

జాబ్ మేళా రేపు

గజపతినగరం: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐటీఐ, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు తమ రెజ్యూమ్,ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలని, వివరాలకు ఫోన్ నంబర్లు 79898 26953 లేదా 99888 53335ను ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

బెల్లం ఊట ధ్వంసం

గుర్ల: మండలంలోని దేవుని కణపాక, పకీరు కిట్టాలి గ్రామాల్లోని శివారు ప్రాంతంలో సోమవారం దాడులు చేపట్టి సుమారు 600 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల సారా పారబోసినట్లు ఎక్సైజ్ ఎస్సై రమణరావు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సుదర్శనరావు, కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడి..

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ బట్టీలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖరనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ఎన్.రమశ్రీ, వీఎన్ రాజు, సిబ్బంది టి.వీర్రాజు, బి.ఆదినారాయణ, జి.రమేష్ పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బదిలీ అయిన ఈఓపీఆర్డీ గాయత్రితో పాటు నలుగురు పంచాయతీ కార్యదర్శులను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు , వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొ ట్నూరు సన్యాసినాయుడు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ వరప్రసాద్, కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు అన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గరి విడి పోలీస్‌స్టేషన్ ఆవరణలో విజయనగరం ఎస్.వి.ఎస్ బ్లడ్ బ్యాంకు సహకారంతో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన 107 మంది దాతలను అభినందించారు. చీపురుపల్లి సీఐ శంకరరావు, ఎస్‌ఐ ఎల్.దామోదరరావు, గరివిడి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు, బుదరాయవలస ఎస్‌ఐ ఎల్.లోకేశ్వరరావు, మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బి.వి.గో విందరాజులు పాల్గొన్నారు. – చీపురుపల్లిరూరల్(గరివిడి)

ఉద్యోగార్థులకు బాసట



శాసన మండలి ప్రతిపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు సందీప్ ఆధ్వర్యంలో నడుస్తున్న ధీర ఫౌండేషన్ గజపతినగరం, దత్తిరాజేరు శాఖా గ్రంథాలయాలకు పోటీ పరీక్షల పుస్తకాలను సమకూర్చింది. రైల్వే అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ గ్రేడ్–3, ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ, జూనియర్ ఇంజినీర్, పారామెడికల్, నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన 60 పుస్తకాలను ఆయా గ్రంథాల యాల అధికారులకు ధీర ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం అందజేశారు.ధీర ఫౌండేషన్ అధ్యక్షుడు సందీప్‌కు లైబ్రేరియన్‌లతో పాటు ఆయా గ్రంథాలయాల్లో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న యువత కృతజ్ఞతలు తెలిపారు. – గజపతినగరం

ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా



జీవిత బీమా సంస్థ(ఎస్‌ఐసీ)ను నిర్వీర్యం చేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని ఏజెంట్స్ అసోసియేషన్ ధ్వజమెత్తింది. ఆలిండియా లియాఫీ యూనియన్ పిలుపు మేరకు స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు సోమవారం ధర్నా చేశారు. , యూనియన్ ఎస్.కోట బ్రాంచి ప్రెసిడెంట్ సూర్యనారాయణ, సెక్రటరీ దేముడు మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఏజెంట్ల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పూనుకుందని, ఇందులో భాగంగానే పాలసీ ప్రీమియం రూ.1 లక్ష నుంచి రూ. 2లక్షలకు పెంచారన్నారు.పెంచిన ప్రీమియం తగ్గించాలని, పాలసీలపై జీఎస్టీ తొలగించాలని, బోనస్ పెంచాలని, లోన్‌పై వడ్డీ రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. డివిజన్ జాయింట్ సెక్రటరీ కె.కె.నాయుడు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ కె.ఆర్.సీ.హెచ్.మోహన్‌రావు, ఏజెంట్లు జి.ఈ.వి.సత్యం, కె.ఏ.రామారావు, పోతన్న, అప్పలస్వామి, వెంకటరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే పనులు చేపట్టాలి



లక్కవరపుకోట: ఎంపీడీఓ అప్పారావుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు



శృంగవరపుకోట: ఎంపీడీఓ సతీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



వేపాడ: ఎంపీడీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్‌లు

లక్కవరపుకోట/ శృంగవరపుకోట/వేపాడ: గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో మంజూరయ్యే అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని ఎల్.కోట, ఎస్.కోట, వేపాడ మండలా ల సర్పంచ్‌లు ఆయా మండలాల ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఎల్.కోటలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు , శృంగవరపుకోటలో జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వేపాడలో ఎంపీపీ సత్యవంతుడు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్పంచ్‌లకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, పనులన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరిగాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులకు మంజూరు చేసిన నిధులను వెండర్స్ పేరిట టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. గ్రామ పంచాయతీలు ఆమోదించిన పనులు కాకుండా టీడీపీ నాయకులు గుర్తించిన పనులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం దారుణమన్నారు. గ్రామసభల్లో పంచాయతీలు తీర్మానించి, సర్పంచ్‌లు,వార్డు మెంబర్లు ఆమోదం తెలిపిన పనులనే చేయించాలని, వాటికే నిధులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు లేదా పాలకవర్గం నామినేట్ చేసిన వ్యక్తులు పనులు చేస్తేనే నాణ్యత, జవాబుదారీతనం ఉంటుందన్నారు.ప్రభుత్వం వెండర్ల ద్వారా పనులు చేయించాలన్న నిర్ణయం రాజకీయ కుట్ర తప్ప గ్రామ స్వరాజ్యాన్ని గౌరవించడం కాదన్నారు. పల్లె పండగ కార్యక్రమం పేరిట ఇటీవల గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ కార్యక్రమాలను పలు చోట్ల సర్పంచ్‌లు లేకుండానే టీడీపీ నాయకులతో అధికారులు నిర్వహించేశారని, సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తే న్యాయపోరాటానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఎస్‌కోట, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీలు ఎం.దుర్గాప్రసాద్, పదాల ధర్మారావు, సర్పంచ్‌లు కె.వెంకటరావు, ఎం.సరోజిని, వై.యామినీదేవి, వేపాడ జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, నీలకంఠరాజపురం ఎంపీటీసీ వేచలపు వెంకట చినరామునాయుడు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎండీఎం నిర్వాహకుల ధర్నా

శృంగవరపుకోట: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులు సీఐటీ యూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ వద్ద సోమవారం ధర్నా చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు, సుప్రీం తీర్పు ప్రకారం రూ.18వేలు కనీస వేతనం ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎంఈఓ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని వినతి

చీపురుపల్లిరూరల్(గరివిడి): రైతుల పంట పొలాలకు వెళ్లే ప్రభుత్వ రస్తా భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడివాడ తమ్మినాయుడు, గ్రామ రైతులు కలెక్టరేట్,గరివిడి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపరిధి లోని తారురోడ్డుకు ఆనుకుని రస్తా ఉందన్నారు. ఈస్థలంలో టీడీపీకి చెందిన వ్యక్తి అక్రమనిర్మాణం చేపట్టడంతో పొలాలకు దారిలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.అధికారులుపరిశీలించి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు.

నేడు మెగా వైద్య శిబిరం

చీపురుపల్లి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బి.ఎస్ లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం మెగావైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆసంస్థ ప్రతినిధి ఎస్.సన్యాసిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్యులు గుండె, క్యాన్సర్, స్త్రీ సంబంధిత సమస్యలు, కీళ్లు, కంటి, తదితర ఆరోగ్య సమస్యలకు వైద్యం అందిస్తారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి జెమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు వైద్యం అందిస్తారని తెలిపారు.

ఫీజు చెల్లించేందుకు రేపటితో గడువు పూర్తి

చీపురుపల్లి: ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ పొందాలనుకునే వారు ఈనెల 30వ తేదీ సాయంత్రంలోగా రూ.500 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించుకునే అవకాశం ఉందని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం సహాయ కో–ఆర్డినేటర్ కాపరోతు మురళీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

చీపురుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పౌరసరఫరాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గద్దే బాబూరావును డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం ఆయన్ని చీపురుపల్లిలో రాష్ట్ర డీలర్ల సంఘం మాజీ అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు రాజారావు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డీలర్లకు మెడికల్, బీమా వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. 800 రేషన్‌కార్డులు ఉన్న డిపోలను విడగొట్టి 400 కార్డుల చొప్పున డిపోలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.దీనివల్ల డీలర్లకు కమిషన్లు తగ్గిపోయి కుటుంబ పోషణ కష్టమవుతుందన్నారు.